సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 20 । మార్చి । 2025



పదో తరగతి విద్యార్థినికి అస్వస్థత

పదవ తరగతి పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలిన సంఘటన గుర్రంకొండలో జరిగింది. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
రాయచోటి	6.30	4.59
రాజంపేట	6.28	5.07
పీలేరు	6.30	4.57
మదనపల్లె	6.32	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 116 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

22న కుల, చేతివృత్తుల సంఘాల నేతల సమావేశం

రాయచోటి అర్బన్: ఈ నెల 22వ తేదీన జిల్లాలోని బీసీ కులాల చేతి, కులవృత్తుల సంఘాల నేతలతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్. జయసింహా ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో నిర్వహించే సమావేశంలో ఆదరణ–3 పథకం కింద అవసరమైన కుల, చేతివృత్తి పనిముట్లకు నేతల సలహాలు, సూచనలను స్వీకరించనున్నామన్నారు. సమావేశానికి నాయిబ్రాహ్మణులు, రజకులు, వడ్డెరలు, మత్స్యకారులు, చేనేత, స్వర్ణకారులు, వడ్రంగులు, పాల వ్యాపారం, కల్లు గీత కార్మికులు, కుమ్మర, మేదర, వాల్మీకి, బోయ , కృష్ణ బలిజ, పూసలు, సగర, ఉప్పర తదితర కులాల నేతలతో పాటు శిల్పి, కరెంటు, ప్లంబింగ్ తదితర చేతివృత్తుల వారు హాజరు కావాలన్నా రు.

26 నుంచి అన్నమయ్య 522వ వర్ధంతి కార్యక్రమాలు



108 అడుగుల అన్నమయ్య విగ్రహం

రాజంపేట: ఈనెల 26 నుంచి తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనుంది. ఈ మేరకు బుధవారం వర్ధంతి కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. 26న తాళ్లపాకలో నగర సంకీర్తన, గోష్ఠిగానం, అన్నమాచార్య సంకీర్తన, హరికథ కార్యక్రమాలు ఉంటాయి. 27, 28, 29న అన్నమాచార్య సంకీర్తన, హరికథలు ఉంటాయి. అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద రెండురోజుల పాటు మాత్రమే వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య సంకీర్తన, హరికథలు నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో ఆధ్యాత్మిక సంగీత సభలను నిర్వహిస్తారు.

జూడాల సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖను కలిసిన ప్రభుత్వ వైద్యకళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం

కడప అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం (జీఎంఎస్‌కె- జూడా) కొత్త కమిటీ ఏర్పాటైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. విజయభాస్కర్ రెడ్డి కొత్త కమిటీని అభినందించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. విజయ్, డాక్టర్ చరిత, డాక్టర్ పూజ, డాక్టర్ ప్రతిభ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. నిఖిల్ సింగ్, డాక్టర్ సుబ్బారెడ్డి కళాశాలలోని సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. కళాశాల సమస్యల గురించి ప్రస్తావించారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



వైవీయూ ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న దూర విద్య డైరెక్టర్ ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపల్ ఎస్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ తో కలిసి మాట్లాడారు. వైవీయూ గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎం కామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంఏ ఎకనామిక్స్ లో ప్రవేశాలు ఉంటాయని అలానే బీకాం, బీబీఏ, బీబీఎం డిగ్రీ చేసిన వారు ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతె చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ (బీఎఫ్ఏ ఆనర్స్) మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్, సమాన అర్హత గల వారు ప్రవేశానికి అర్హులన్నారు.


కూటమి శ్రేణులతోనే రుణానుబంధం

రుణంపై ఆశ



కురబలకోట మండలం చేనేత నగర్‌కు చెందిన వసంత ఇంటర్‌లో బైపీసీ చదివింది. కుటుంబ గడవడానికి భర్త ఆటో డ్రైవర్‌గా కష్టపడుతున్నాడు. స్వయం ఉపాధి పథకం ద్వారా చీరల వ్యాపారం కోసం రూ.4 లక్షల రుణం మంజూరు కోసం దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరైంది. బ్యాంకు రుణం, ప్రభుత్వ రాయితీ అందిస్తే చీరల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటానని అంటోంది.

- బీసీ, చంద్రన్న స్వయం ఉపాధి పథకాల మంజూరుపై నిరుద్యోగుల ఆశలు
- జిల్లాకు రెండు పథకాలకు 1,729 యూనిట్లు కేటాయింపు
- దరఖాస్తులు 14,124
- బీసీలకు తగ్గించి, కాపులకు పెంచిన రాయితీ
- పంచుతారో.. పంచుకుంటారో వేచి చూడాల్సిందే



బి.కొత్తకోటలో ఉపాధి రుణాల ఇంటర్వ్యూ కోసం వచ్చిన దరఖాస్తుదారులు

బి.కొత్తకోట: ప్రభుత్వం అందించనున్న బీసీ కార్పొరేషన్, చంద్రన్న స్వయం ఉపాధి పథకాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు రుణాలు అందుతాయా లేదా అని ఎదురుచూస్తున్నారు. జిల్లాకు కేటాయించిన యూనిట్ల ద్వారా నిజమైన నిరుద్యోగులను గుర్తించి ఉపాధి పొందేలా రుణాలు ఇస్తారా లేక అధికారపార్టీల నేతలే పంచుకుంటారా అన్నదానిపై నిరుద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల అధికారి పార్టీనేతలు తమకు కావాల్సిన వాళ్లకు మంజూరు చేసి లేఖలు ఇవ్వాలన్న ఒత్తిళ్లు అధికమయ్యాయి. వర్గాలు అధికంగా ఉన్నచోట వర్గపోరు మధ్య అధికారులు ఒత్తిళ్లను భరించలేకపోతున్నారు. కొన్నిచోట్ల యూనిట్ల కోసం బహిరంగంగా పోటీ పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి నిరుద్యోగులకు అందుతుందా లేదా అన్నది చర్చనీయాంశమైంది.

నిరుద్యోగ తాండవం

జిల్లాలో నిరుద్యోగులకు కొదవలేన్నట్టుగా కనిపిస్తోంది. బీసీ కార్పొరేషన్ కింద 1,350 యూనిట్లు కేటాయించగా వీటి మంజూరు కోసం 12,332 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 379 యూనిట్లు కేటాయించగా దీనికి 1,792 దరఖాస్తులు వచ్చాయి. రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులకు మండల, మున్సిపల్ అధికారులు, బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులతో మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాలు కిటకిటలాడాయి. మొత్తానికి ఇంటర్వ్యూల ప్రక్రియ పూర్తి చేయగా ఇప్పుడు యూనిట్ల మంజూరు ప్రక్రియ మొదలవుతోంది.

అప్పుడు పెంచి.. ఇప్పుడు తగ్గించి

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలకు 50శాతం రాయితీని అందించారు. ప్రస్తుతం ఇదే రాయితీని ప్రభుత్వం కొనసాగిస్తుందని నిరుద్యోగులు ఆశించారు. అయితే బీసీలకు రాయితీ సొమ్మను తగ్గించి..కాపులకు ఇచ్చే రుణాలకు రాయితీ సొమ్మును పెంచారు. దీనిపై బీసీల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

యూనిట్లు, దరఖాస్తు వివరాలు

బీసీ కార్పొరేషన్ వివరాలు

30 మండలాలకు యూనిట్లు: 1,135
దరఖాస్తులు: 9,724

మున్సిపాలిటీలు	యూనిట్లు
మదనపల్లె	100
రాయచోటి:	50
రాజంపేట:	40
బి.కొత్తకోట:	25
దరఖాస్తులు:	2,608

జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు
మొత్తం యూనిట్లు: 1350
మొత్తం దరఖాస్తులు: 12,332

చంద్రన్న (కాపు) ఉపాధి వివరాలు

30 మండలాలకు యూనిట్లు: 324
దరఖాస్తులు: 1,539

మున్సిపాలిటీలు	యూనిట్లు
మదనపల్లె	21
రాయచోటి:	12
రాజంపేట:	13
బి.కొత్తకోట:	9
దరఖాస్తులు:	253

జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు
మొత్తం యూనిట్లు: 379
మొత్తం దరఖాస్తులు: 1792

బీసీకి తగ్గించి..కాపులకు పెద్దపీట

జిల్లాలో చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద కేవలం కాపులకు మాత్రమే ఈ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కింద జిల్లాకు మొత్తం 379 యూనిట్లు కేటాయించారు. వీటి కోసం 1,792 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 30 మండలాలకు 324 యూనిట్లు కేటాయించగా 1539 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక నాలుగు మున్సిపాలిటీలకు 55 యూనిట్లు కేటాయించగా వీటికోసం 253 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కాగా ఈ పథకం కింద మంజూరయ్యే రుణం బట్టి రాయితీని నిర్ణయించారు. రూ.2 లక్షల రుణానికి రూ.లక్ష రాయితీ, రూ.3 లక్షలకు రూ.1.50 లక్షల రాయితీ, రూ.5 లక్షలకు రూ.2.50 లక్షల రాయితీని నిర్ణయించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం జిల్లా మొత్తానికి 1,350 యూనిట్లు కేటాయించింది. ఈ యూనిట్ విలువను బట్టి రాయితీ నిర్ణయించింది. ఇందులో రూ.2లక్షల రుణానికి రూ.75వేలు, రూ.3 లక్షల రుణానికి రూ.1.25 లక్షల రాయితీ, రూ.5 లక్షల రుణానికి రూ.2 లక్షల రాయితీగా నిర్ణయించింది.

పూర్తయిన పనులను ఉగాది రోజున ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పూర్తయిన పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ శాఖ సిబ్బంది, వీఆర్‌ఓలు, సర్వే సిబ్బంది, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది తదితరులతో పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలు, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలు, రీ సర్వే, ఇళ్లపట్టాల రీ వెరిఫికేషన్, పల్లె పండుగ కార్యక్రమాలు, ఎన్టీఆర్ హౌసింగ్, పి–4 సర్వే తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పూర్తయిన పల్లె పండుగ పనుల ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: డీడీయూ జీకేవై ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సుల్లో 4 నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 ఏళ్లలోపు కలిగి టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 24 నుంచి బ్యాచ్ ప్రారంభిస్తున్నామన్నారు.

ఇస్రో పిలుస్తోంది... వెళ్దాం రండి..!

తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం

మదనపల్లె సిటీ: అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఆ సంగతులేంటో తెలుసుందాం రండి. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో వంద ప్రయోగాలను పూర్తి చేసుకుంది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజెప్పేందుకు ఇస్రో ఈ కార్యక్రమం చేపడుతోంది.

23 వరకు గడువు:

విద్యార్థులు మార్చి 23వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీటటౌ.జ౯౦.జీ ౧ లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల వడబోత అనంతరం ఏప్రిల్7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా–25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు కార్యక్రమం ఉంటుంది.

7 కేంద్రాల్లో నిర్వహణ: ఇస్రో ఈ కార్యక్రమాన్ని ఏడు కేంద్రాల్లో చేపడుతోంది. డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్నాటక), అహ్మదాబాద్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), షిల్లాంగ్(మేఘాలయ).

ఎవరు అర్హులు: 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8 లో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తా రు. స్పేస్, సైన్సు క్లబ్‌లలో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాల వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

అన్నీ ఉచితంగానే...

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికై న విద్యార్థులను మే నెలలో కేటాయించిన రోజులలో ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి



జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రతిభా అన్వేషణ్ పరీక్షలు రాయించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశాన్ని కల్పిస్తారు. ఇలాంటి అరుదైన అవకాశాన్ని విద్యార్థి దశలోనే పొందితే కచ్చితంగా దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదుగుతారు. ప్రధానోపాధ్యాయులు దీనిని బాధ్యతగా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించాలి. – సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు..



టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ప్రతి మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా ఉన్నత స్థాయిని అధిరోహించడానికి కల్పిస్తున్న అవకాశాల్లో ఇది ఒకటి. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునేలా సైన్సు టీచర్లు కృషి చేయాలి. ఆసక్తి ఉన్న వారు మార్చి 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. –మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

జెడ్పీ ఛైర్మన్ ఎన్నికలపై మంతనాలు



సమావేశంలో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

కడప కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 27వ తేది నిర్వహించే జెడ్పీ ఛైర్మన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చర్చించారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన వారు సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య క్షేత్రానికి రైళ్లేవి?

ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని క్షేత్రంలో ఉన్న రైల్వేస్టేషన్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఓ వైపు టీటీడీ వార్షిక బ్రహ్మోత్సవాలను కోట్లాది రూపాయిలు వెచ్చించి వైభవంగా నిర్వహిస్తుంటే.. దూర ప్రాంతాలకు చెందిన వారు ఈ వైభవం, ఆలయం ప్రాశ్యస్తంను తెలుసుకునేందుకు రావాలంటే రైలు సౌకర్యం లేదు. టీటీడీ చొరవతో అయినా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ బాగుపడుతుందా అని భక్తులు ఎదురుచూస్తున్నారు.

- ఒంటిమిట్ట కోదండ రామాలయానికి రైలుమార్గంలో వచ్చేదెలా..?
- భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?
- మొన్నటి వరకు ఒంటిమిట్ట, భద్రాచలం రెండు ఎస్సీ రైల్వేలోనే ..
- విశాఖ జోన్‌కే తలమానికం ఒంటిమిట్ట రామాలయం
- ఒంటిమిట్టపై రైల్వేశాఖ వివక్ష
- భక్తులకు రైలు సౌకర్యంపై దృష్టిపెట్టని టీటీడీ



ఒంటిమిట్ట రైల్వేస్టేషన్

రాజంపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు భద్రాచలం అధికారిక రామాలయంగా భాసిల్లింది. నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత ఆంధ్రా భద్రాచలంగా ఒంటిమిట్ట కోదండరామాలయం అధికారిక రామాలయంగా ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది. రెండవ అయోధ్యగా..ఏకశిలానగరంగా పిలవబడుతున్న ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు భక్తులు చేరుకునేందుకు రైలే లేదు. ఉన్న ఏ రైలూ ఆగదు. ఏటా ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈయేడాది ఏప్రిల్ 5 నుంచి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించేందుకు టీటీడీ సన్నాహాలు చేస్తోంది. కానీ సౌత్ సెంట్రల్ రైల్వే తమ వంతు బాధ్యతగా ఒంటిమిట్టకు భక్తులు చేరుకునేందుకు కల్పించిన రైలు సౌకర్యం శీతకన్ను పెట్టిందనే విమర్శలున్నాయి. ఒంటిమిట్ట రామయ్య చెంతకు చేరుకునేందుకు భక్తులకు వీలులేని పరిస్థితులు దాపురించాయి.

భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే దక్షిణ మధ్య రైల్వే శీతకన్ను చూపుతోందనే అపవాదును మూటకట్టుకుంది. ముంబాయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలో నడిచే ప్రతి రైలుకు ఒంటిమిట్టలో స్టాపింగ్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు అంటున్నారు. ప్రస్తుతానికి డెమో ఒక్క రైలు మాత్రం ఉదయం, సాయంత్రం ఆగుతుంది. కోవిడ్ ముందు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్టను ఆంధ్రా భద్రాదిగా గుర్తించి, అభివృద్ధి చేస్తుంటే రైల్వేశాఖ తన వంతు పాత్రను పోషించడం లేదు. పల్లె స్టేషన్‌లాగే రైల్వేశాఖ భావిస్తోంది. ఒక సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఒంటిమిట్టను పరిగణనలోకి తీసుకోలేదు. ఒంటిమిట్ట, భద్రాచలం రెండు పుణ్యక్షేత్రాలు దక్షిణ మధ్య రైల్వేలోనే ఉండేది. భద్రాచలం స్టేషన్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను ఒంటిమిట్టకు ఇవ్వడం లేదంటే వివక్షను ప్రదర్శించినట్లేనని భక్తులు భావిస్తున్నారు.

రైలు సౌకర్యంపై దృష్టి పెట్టని టీటీడీ ..

ఒంటిమిట్ట రామాలయం టీటీడీలో విలీనమైంది. అయితే ఎంతసేపు రామాలయం అభివృద్ధి వరకు దృష్టి కేంద్రీకరించింది. అయితే రామయ్య క్షేత్రానికి భక్తులు వచ్చేందుకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఒంటిమిట్టకు భక్తులు వచ్చేలా రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని టీటీడీ రైల్వేబోర్డును కోరితే తప్పకుండా స్పందిస్తుందని రైల్వే వర్గాలు చెపుతున్నాయి. ఈవో భక్తులకు రైలు సౌకర్యం కల్పించే విషయంసౌ దృష్టిపెట్టాలని రాష్ట్రంలోని పలు ప్రాంతాల భక్తులు కోరుతున్నారు.

దూరప్రాంత భక్తులెలా వచ్చేది..

దూర ప్రాంత భక్తులు రైలుమార్గంలో రామయ్య చెంతకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్ట రామయ్య దర్శనానికి వస్తున్నారు. భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ మీదుగా భక్తులు వచ్చేందుకు వీలుగా రైళ్లు నడుస్తున్నాయి. ఒంటిమిట్ట స్టేషన్ పేరుకు మాత్రమే ఉంది. నవమి బ్రహ్మోత్సవాలు, స్వామివారి కళ్యాణం రోజున లక్షలాది మంది భక్తులు ఒంటిమిట్టకు చేరుకుంటారు. ఒంటిమిట్ట స్టేషన్ అభివృద్ధి చేయాలంటూ ప్రజాప్రతినిధులు గళం విప్పుతున్నారు. అయినా రైల్వేశాఖలో ఎటువంటి స్పందన కనిపించలేదన్న విమర్శలున్నాయి.

కొత్తజోన్‌లో అయినా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న ఎస్సీ రైల్వేలో ఏపీకి ప్రత్యేకంగా జోన్ ఏర్పాటైంది. విశాఖ జోన్‌కే తలమానికం ఒంటిమిట్ట రామాలయం. అధికారికంగా గుర్తించిన రామాలయం ఇదే. అటువంటప్పుడు కొత్త జోన్ వల్ల రామాలయం ఉన్న ఒంటిమిట్ట స్టేషన్‌కు గుర్తింపు వస్తుందన్న ఆశలున్నాయి.

భక్తుల రాకకు రైలు మార్గమే అనుకూలం



దూరప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్టకు చేరుకునేలా రైలు సౌకర్యం కల్పించాలి. భక్తులకు ఏ విధంగా భద్రాచలం రైల్వేస్టేషన్ సౌకర్యంగా ఉందో, అలాగే ఒంటిమిట్టను మార్చాలి. ఏపీకి అధికారిక రామాలయంగా గుర్తించారు. అదే రీతిలో రైల్వేపరంగా భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు కృషిచేయాలి. కనీసం కళ్యాణం రోజైనా స్టాపింగ్ కల్పించాలి. ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథ్‌రెడ్డిల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళతాం. –తంబ్లెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు

రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళతాం



టీటీడీ ఒంటిమిట్ట కోదండ రామాలయంకు ప్రత్యేక గుర్తింపు ఇస్తోంది. మరి ఎందుకు రైల్వేశాఖ వివక్ష చూపుతోంది. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ద్వారా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్, స్టేషన్ అభివృద్ధి అంశాలను రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళతాం. తెలంగాణాలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి, రైలు సౌకర్యం కల్పించినప్పుడు ఆంధ్రా భద్రాచలం రైల్వేశాఖకు కనిపించలేదా. భక్తులు ఒంటిమిట్టకు చేరుకునేందుకు ఒక్కరైలు కూడా అందుబాటులో లేదు. – తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు

క్లుప్తంగా

వాహనం ఢీకొని జింకపిల్ల మృతి



బి.కొత్తకోట : రోడ్డు దాటుతున్న మూడు నెలల వయసున్న జింక పిల్లను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం బి.కొత్తకోట సమీపంలోని బాలసానివారిపల్లి వద్ద జరిగింది. జింకపిల్ల రోడ్డుపై గాయాలతో పడి ఉండగా స్థానికులు గుర్తించి పశువైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు విరిగిన కాలుకు కట్టుకట్టి మందులు తాపించారు. అయినప్పటికి మృతి చెందింది. అటవీశాఖ బీటు అధికారి ప్రకాష్ వివరాలను సేకరిస్తున్నారు.

గిరిజనులపై దాడులు అరికట్టాలి

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లాలో గిరిజనులపై జరిగే దాడులను అరికట్టాలని ఏపీ బంజారా సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేంద్రనాయక్ చౌహాన్ డిమాండ్ చేశారు. రాయచోటిలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోజు రోజుకు గిరిజనులపై దాడులు అధికమయ్యాయని తెలిపారు. గుర్రంకొండ, మదనపల్లెలలో కొంత మంది గుండాలు దాడులు చేసినా ఇప్పటివరకు అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు.

చిన్నారి సంబంధీకులు స్పందించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా ములకలచెరువు ఉమాశంకర్‌కాలనీ ఆదర్శ పాఠశాల వద్ద గుట్టలో వదిలేసి వెళ్లిన చిన్నారి సంబంధీకులు 30 రోజుల్లోగా తమను సంప్రదించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పి.రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె రాయచోటిలో మాట్లాడుతూ 3 నుంచి 5 రోజుల ఆడ శిశువును ములకలచెరువు ఆదర్శ పాఠశాల వద్ద వదిలి వెళ్లిపోయారన్నారు. ఆ చిన్నారి తమ సంరక్షణలో ఉందన్నారు. ఎవరూ స్పందించకుంటే ఈ పాపను అనాథగా ప్రకటించి, ప్రభుత్వ షరతులు, నియమాల ప్రకారం మరొకరికి దత్తత ఇస్తామన్నారు.

కందిపంటకు నిప్పు



మంటల్లో కాలిపోయిన కందిపంట

పెద్దమండ్యం : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 3 ఎకరాలలో ఓ రైతు సాగుచేసిన కందిపంట అగ్నికి ఆహుతైంది. మండలంలోని ఎన్‌ఓ పల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు సమీపంలో ఈ ఘటన జరిగింది. రైతు కథనం మేరకు.. కలిచెర్ల పాతూరుకు చెందిన సయ్యద్ అలీ అక్బర్ తనకున్న 3 ఎకరాలలో కందిపంటను సాగు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కందిపంట మొత్తం కాలిపోయింది. ప్రత్యామ్నాయ పంటగా సాగుచేసిన కందిపంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. రూ. 1 లక్ష నష్టం జరిగినట్లు తెలిపాడు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా కాలిపోయిన పంటను వీఆర్‌ఓ పరిశీలించారు.

ఉపవాస దీక్ష.. ఆరోగ్య రక్ష

- ఉపవాస దీక్ష విరమించేవారికి ఉచితంగా గంజి పంపిణీ
- రంజాన్ మాసమంతా కొనసాగనున్న కార్యక్రమం
- రూ.3 లక్షలు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్న షేక్ సాదిక్‌పాషా



గంజిని పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఆచరించే ఇస్లాం మార్గదర్శకాల్లో రంజాన్ ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రంజాన్ నెలలో 30 రోజుల పాటు కఠోర ఉపవాసాలు ఆచరించడంతో పాటు ఐదుపూటలా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నెలవంక కనిపించిన మరుసటి రోజు నుంచి ప్రారంభమయ్యే రోజా (ఉపవాసాలు) షవ్వాల్ నెలవంక దర్శనంతో ముగుస్తాయి. ప్రతి ముస్లీం నమాజు చేయడంతో పాటు ఉపవాసాలు పాటించాలని ఇస్లాం సూచిస్తుంది. వేకువ జామునే ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభమవుతుంది. సూర్యాస్తమయమయ్యాక (ఇఫ్తార్) వరకు ఉపవాసం పాటిస్తారు. పగలంతా ఉపవాసం పాటించిన దీక్షాపరులు సాయంత్రం నిర్ణీత వేళలో తొలుత పండ్లు తిని దీక్ష విరమిస్తారు. ఉపవాసం విరమించే వారికి అనేక మంది వివిధ రకాల ఆహార పదార్థాలను ఇస్తుంటారు. అయితే రాజంపేట పట్టణం ఉస్మానగర్‌కు చెందిన షేక్ సాదిక్‌పాషా రంజాన్ మాసమంతా యాష్ (గంజి) పంపిణీ చేస్తారు.

గంజికి విశేష ఆదరణ..

సాదిక్‌పాషా పంపిణీ చేసే గంజి రాజంపేట పట్టణంలో విశేష ఆదరణ పొందింది. అందువల్ల రోజా ఉండే ముస్లీంలే కాక ముస్లిమేతరులు కూడా గంజిని తీసుకెళతారు. దాదాపు 15 సంవత్సరాలుగా సాదిక్‌పాషా గంజిని పంపిణీ చేస్తున్నారు. రోజుకు పదివేల రూపాయల చొప్పున నెలకు మూడు లక్షల వరకు సాదిక్‌పాషా గంజికోసం ఖర్చు చేస్తారు. నిత్యం సాయంత్రం వేళల్లో గంజిని పంపిణీ చేస్తారు. పట్టంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు దాదాపు ఐదు వందల మందికి పైగా గంజిని తీసుకెళుతుంటారు.

పోషకాలకు నెలవు

రోజంతా ఉపవాసం ఉండటం వల్ల మనిషి శరీరం నీరసిస్తుంది. అందువల్ల సాదిక్‌పాషా అనేక పోషక పదార్థాలతో గంజిని తయారు చేయిస్తారు. ఇందులో ప్రధానంగా పెసరబేడలు, బార్లీ బియ్యం, కొబ్బరి, పుదీన, కొత్తిమీర, ఉల్లిపాయలు, టమాటాలు, లవంగాలు, దాల్చిన చెక్క వంటి పదార్థాలను గంజి తయారీలో ఉపయోగిస్తారు. దాదాపు నాలుగు గంటల పాటు కట్టెల పొయ్యి మీద బాగా ఉడికించి తయారు చేస్తారు. ఈ గంజి హలీం రుచికి ఏమాత్రం తీసిపోదని ముస్లీంలు చెబుతున్నారు. గంజి బలవర్ధకమైన పానీయమని అందువల్ల ఉపవాస దీక్షాపరులకు గంజి వెంటనే శక్తిని ఇవ్వడమే కాక ఆరోగ్యానికి కూడా మంచిదని వారు పేర్కొంటున్నారు.

అల్లాహ్ కృపవల్లే..



దాదాపు 15 ఏళ్ల క్రితం ఇఫ్తార్ సమయంలో ఉపవాసం ఉండేవారికి గంజి పంపిణీ చేశాను. అప్పుడు గంజి తాగిన వారంతా ఎంతో రుచిగా ఉందన్నారు. మీరు ఎప్పుడైనా ఇఫ్తార్ సమయంలో ఆహారం పంపిణీ చేయాలనుకుంటే గంజినే పంపిణీ చేయమని ఉపవాసం ఉంటున్న వారు చెప్పారు. అల్లాహ్ నాకు మంచి జీవితాన్ని ఇచ్చాడు. ఉపవాస సమయంలో అల్లాహ్ స్మరణలో ఉండేవారికి రోజూ గంజి ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ప్రతి ఏడాది గంజి ఉచితంగా పంపిణీ చేస్తున్నా. ఇదంతా అల్లాహ్ కృపవల్లే జరుగుతోంది.

– షేక్ సాదిక్‌పాషా, ఉస్మాన్ నగర్, రాజంపేట

మొదటి నుంచి ఈ గంజి తాగుతున్నా



ఉస్మాన్ నగర్‌లో పంపిణీ చేసే గంజిని నేను మొదటి నుంచి తాగుతున్నాను. ఎంతో రుచిగా ఉంటుంది. అందువల్ల మా ఇంట్లో వాళ్లు అందరు కూడా ఎంతో ఇష్టంగా గంజిని తాగుతారు. ముఖ్యంగా ఉపవాసం ఉండేవారికి ఈ గంజి శక్తినిచ్చే ఔషధంగా పనిచేస్తుంది.

– సయ్యద్ బాషా, రాజంపేట

జీతం బకాయిలను చెల్లించాలి



డీఆర్‌ఓ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగ సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 15 నెలలుగా జీతం బకాయిలను చెల్లించకుండా వేధిస్తోందని, వారికి వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులతో కలసి ఆయన డీఆర్‌ఓ మధుసూదన్‌ను కలసి సమస్యలపై విన్నవించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో జీతాలందకపోవడంతో ఉద్యోగుల కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందిగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు జీతాలు విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకట్రామయ్య, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ వ్యవహారంపై విచారణ

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో ఫ్లైయాష్ రవాణా వ్యవహారంపై ఏపీజెన్‌కో యాజమాన్యం రహస్యంగా విచారణ చేపట్టింది. గురువారం ఏపీజెన్‌కో నుంచి కొందరు అధికారులు విచారణ నిమిత్తం ఆర్టీపీపీకి వచ్చారు. గతంలో ఫ్లైయాష్ విషయంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలడంతో ముగ్గురు అధికారులపై వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఇప్పుడు ఫ్లైయాష్ వ్యవహారంపై రహస్యంగా విచారణ చేపట్టడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

పదో తరగతి విద్యార్థినికి అస్వస్థత

పరీక్షా కేంద్రంలోనే కుప్పకూలిన వైనం



కుప్పకూలిన విద్యార్థిని రజిత



పరీక్షా కేంద్రం నుంచి స్ట్రెచర్‌పై విద్యార్థినిని బయటకు తీసుకొస్తున్న ఆరోగ్య, 108 సిబ్బంది

గుర్రంకొండ : పదవ తరగతి పరీక్షా కేంద్రంలో అందరిలాగే పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని అకస్మాత్తుగా అస్వస్థతకు గురై అక్కడే కుప్పకూలిన సంఘటన బుధవారం అన్నమయ్య జిల్లా గుర్రంకొండలో జరిగింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేవలం ఒక గంట మాత్రమే హిందీ పరీక్ష రాసి విద్యార్థిని కుప్పకూలడం అందరిని కలచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ ఉర్దూ జెడ్పీహైస్కూల్‌లో 178 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన కె. రామచంద్ర కుమార్తె కె. రజిత చెర్లోపల్లె జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదివి గుర్రంకొండ ఉర్దూ జెడ్పీ హైస్కూల్లోని పరీక్షా కేంద్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తోంది. బుధవారం అందరిలాగే రామచంద్ర తన కుమార్తెను గుర్రంకొండకు తీసుకొచ్చి పరీక్షా కేంద్రంలో వదిలి తాను అక్కడి పరిసరాల్లోనే ఉన్నాడు. హిందీ పరీక్షను విద్యార్థులు రాయడం ప్రారంభించిన గంట తరువాత పరీక్షా కేంద్రంలో విద్యార్థిని రజిత కుప్పకూలిపోయింది. గమనించిన ఉపాధ్యాయులు అక్కడే ఉన్న ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థినికి చికిత్స చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో వైద్యాధికారి చైతన్య అక్కడికి చేరుకొని వైద్యసేవలు అందించారు. ఎంతకూ విద్యార్థిని కోలుకోకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించాల్సిందిగా సూచించారు. ఎంఈఓ సురేంద్రబాబు, పరీక్షా కేంద్రం చీఫ్ రమణ 108 వాహనంలో విద్యార్థినిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాలుడికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

సాక్షి ఎఫెక్ట్..

నందలూరు : 'మా బిడ్డను కాపాడండయ్యా' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ నాగిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన నాయనపల్లి హరిప్రసాద్, స్వర్ణలత దంపతుల కుమారుడు నవీన్ తేజ (14) గుండె జబ్బుపై కథనం ప్రచురితమైన విషయం విదితమే. నందలూరు ప్రభుత్వ వైద్యాధికారులు శరత్ కమల్, కార్తీక్ విశ్వనాథ్, ఏఎన్‌ఎం నాగలక్ష్మీ బాధితుని ఇంటికి వెళ్లి నవీన్ తేజ తల్లిదండ్రులతో మాట్లాడారు. విషయాన్ని అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ లోకవర్ధన్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవీన్ తేజను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు తరఫున సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు పంపించి అవసరమైన చికిత్స చేయిస్తామని వారు తెలిపారు.



నవీన్ తేజ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యాధికారులు

సస్యరక్షణ పాటిస్తే మంచి దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి

రైల్వేకోడూరు అర్బన్ : మామిడి రైతులు సస్యరక్షణలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు బుధవారం పేర్కొన్నారు. స్థానిక అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మామిడి పిందె నిలబడటంపై సస్యరక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో అధిక దిగుబడులు పొందేందుకు సమగ్ర పోషణ, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అలాగే రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని సూచించారు. ప్రారంభ దశలో తేనెమంచు పురుగు నివారణకు వేపనూనె, అజాడిరెక్టిన్ జిగురు మందు అధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందెలు రాలుతున్నప్పుడు అధికారుల సూచనల మేరకు ప్లానోఫిక్ మందు 500 లీటర్లకు 100 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి కాయలకు ఉపయోగించే కవర్లు సబ్సిడీతో అందిస్తున్నామని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెగుళ్ల నివారణ శాస్త్రవేత్త సందీప్ నాయక్, రాజంపేట ఉద్యాన అధికారులు వెంకటభాస్కర్, సురేష్ బాబు, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

నాటు బాంబుల కేసులో నలుగురు బైండోవర్



తహసీల్దార్ భీమేశ్వర్‌రావు వద్ద బైండోవర్ అయిన నిందితులు

పీలేరు రూరల్ : వేరుశనగ రక్షణ కోసం నాటు బాంబులు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన కేసులో నలుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన కౌలు రైతు గుట్టమీద వెంకటేశ్వర్‌రాజు ఒక ఎకరా వేరుశనగ సాగు చేశాడు. పంట రక్షణకు పొలం చుట్టూ విద్యుత్ తీగలతోపాటు నాటు బాంబులు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం అడవిపంది నాటుబాంబు పేలి మృతి చెందింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులకు అందిన సమాచారంతో ఎనుమలవారిపల్లెకు చెందిన గుట్టమీద వెంకటేశ్వర్‌రాజు, జయచంద్రారెడ్డి, ఎస్. భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రాజులను బుధవారం స్థానిక తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పీలేరులో ఐపీ బాంబు కలకలం

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలో ఓ ప్రముఖ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాని ఐపీ బాంబు పేలుస్తారని పుకార్లు షికార్లు చేయడంతో అప్పులు ఇచ్చిన బాధితులు బుధవారం స్థానిక సీఐ యుగంధర్‌ను ఆశ్రయించారు. పీలేరు పట్టణంలో గత 33 ఏళ్లుగా తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి స్వీట్స్ అండ్ బేకరీ నడుపుతున్నాడు. ఏళ్ల తరబడి ఇక్కడే నివాసం ఉండడంతో స్థానికులంతా సుపరిచితులు. ఈ క్రమంలో వారికి పలువురు అప్పులు ఇచ్చారు. పలువురి వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం షాపు యజమానులు తమ చెక్కులు చోరీకి గురయ్యాయని, తమ చెక్కులు ఇతరుల వద్ద ఉంటే అవి చెల్లవని నోటీసులు పంపారు. నోటీసులు అందుకున్న రుణదాతలు తాము మోసపోయామని చర్చించుకునే సమయంలో షాపు మూత పడడంతో, యజమానులు కనబడకపోవడం తీవ్ర ఆందోళన చెందారు. పలువురు రుణదాతలు సీఐ యుగంధర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లీగల్ నోటీసు అందుకున్నవారు కోర్టులో తేల్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మోసం చేసినట్లు స్పష్టమైన ఆధారాలతో వస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చీటింగ్ కేసు నమోదు

కొండాపురం : భూమి కొనుగోలుకు తన వద్ద రూ. 60 లక్షలు నగదు తీసుకుని అగ్రిమెంట్ రాసుకున్న తర్వాత అదే భూమిని వేరొకరికి విక్రయించారంటూ నరసింహారెడ్డి అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ కథనం మేరకు వివరాలు ఇలా.. మండల పరిధిలోని గండ్లూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కులశేఖర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన 17 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. రూ. 60 లక్షలు నగదు ఇచ్చినట్లు అగ్రిమెంట్ రాసుకున్నాడు. అయితే ఈ 17 ఎకరాల్లో 10 ఎకరాల భూమిని కులశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు వేరే వారికి విక్రయించారు. దీంతో బాధితుడు నరసింహారెడ్డి తనను మోసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంకల్పం బలంగా ఉంటే... బండైనా బద్ధలవదా.!



మదనపల్లె మండలం కొండమీదపల్లె సమీపంలోని అడవిలోపల్లె వద్ద రాతి గుండుపై మద్ది చెట్టు పెరుగుతోంది. చెట్టు వేర్లు రాతి గుండును చీల్చుకుంటూ బయటకు కనిపిస్తున్నాయి. సంకల్పం బలంగా ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయొచ్చనేందుకు ఈ దృశ్యమే నిదర్శనమంటూ స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – మదనపల్లె సిటీ

వాతావరణ మార్పు.. మామిడి రైతు కుదుపు

ఆలస్యంగా పూత రావడంతో రైతుల్లో గుబులు



కొండూరు ఏరియాలో విపరీతంగా పూత పూసిన మామిడి చెట్టు

పెనగలూరు : ఈ ఏడాది వాతావరణంలో మార్పుల వల్ల సంక్రాంతి వరకు వర్షాలు పడటంతో మామిడి రైతుల్లో ఆందోళన మొదలైంది. రైతులతోపాటు వ్యాపారుల్లో కూడా గుబులు పుట్టింది. మామిడి తోటలనే నమ్ముకొని జీవిస్తున్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నట్లు ఇప్పటికే తేలిపోయింది. మండలంలో 3992 ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. శివరాత్రికి పిందెలు పుట్టి ఉగాదికి ఊరగాయంత పచ్చడి కాయలు కావాల్సి ఉంది. కానీ నేటికీ మామిడి తోటల్లో పూత దశలోనే ఉండటంతో పిందె వస్తుందా రాదా అన్న సందేహంలో రైతులు ఉన్నారు. తోటల్లో పూత విపరీతంగా వచ్చింది. పూత వచ్చిందన్న ఆనందంలో రైతులు ఉన్నప్పటికీ ఇప్పటికే పూత మాడిపోతూ రాలిపోతోంది. ఇక పిందె వస్తుందా రాదా అన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారు. కొంత మంది వ్యాపారులు పూత రాకముందే తోటలను కొనుగోలు చేశారు. గత సంవత్సరం మామిడి కాయలు కాయకపోవడంతో ఈ ఏడాది కాపు వస్తుందని ఇటు వ్యాపారులు, అటు రైతులు ఆనందంగా ఉండేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పూతను చూసి ఇప్పటికే మూడు, నాలుగుసార్లు మందును పిచికారీ చేశారు. రైతులు బయట అప్పులు తెచ్చుకోవాలన్నా, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా మామిడి తోటలపైనే ఆధారపడుతున్నారు. పూతకు పిందెలు నిలబడి మంచి ఫలితం రావాలని రైతులు ఆశిస్తున్నారు.

మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టు..

మామిడి తోటలో కాపురాక పూతకు తగ్గ పిందె లేకపోవడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు తయారైంది. 2023లో కాపు అధికంగా రావడంతో ధరలు లేక టన్ను రూ. 6 వేలు నుంచి రూ. 7 వేలుకు రైతులు అమ్మకాలు చేశారు. 2024లో కాపు 20 శాతం కూడా రాకపోగా కొంతమంది రైతులకు ఎకరాలలో మామిడి తోటలు ఉన్నా కాయలు కాయని పరిస్థితి. గత మూడు సంవత్సరాలుగా మామిడి రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారు. దీంతో మండలంలోని మామిడి రైతు పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టు తయారైంది.

మగపూత ఎక్కువగా వచ్చింది..



ఈ ఏడాది సంక్రాంతి వరకు వర్షాలు పడటంతో పూత రావడం ఆలస్యమైంది. ఆ పూత కూడా మగపూత రావడంతో పిందెలు రావడం కష్టంగా తయారైంది. మండలంలో ఎక్కువగా మామిడి తోటలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సురేష్, వ్యవసాయ అధికారి, పెనగలూరు.

మూడు సార్లు మందులు పిచికారీ చేశాం



పూత వచ్చి పిందె పూర్తిగా రాకపోవడంతో మూడుసార్లు మందును పిచికారీ చేశాం. వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. అయినా ఫలితం వస్తుందన్న నమ్మకం లేదు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– శ్రీనివాసరెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి, పెనగలూరు.

మామిడి తోటలను కొట్టేస్తున్నారు



కట్టావారిపల్లి ఏరియాలో మామిడి తోటలను కొట్టేస్తున్నారు. మామిడిలో రైతులకు తగినంత ఆదాయం రాకపోవడంతో చెట్లను నరికివేసి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు. మామిడి రైతులు మూడు సంవత్సరాల నుంచి నష్టాలు భరిస్తున్నారు.

– కృష్ణమ నాయుడు, రైతు, కట్టావారిపల్లి, పెనగలూరు.

మామిడి తోటకు నిప్పు : 40 చెట్లు దగ్ధం



ఆకతాయిల చేష్టలకు కాలుతున్న మామిడి తోట

చిన్నమండెం : ఆకతాయిలు మామిడి తోటకు నిప్పు పెట్టడంతో 40 మామిడిచెట్లు కాలిపోయినట్లు బాధిత రైతులు బయన్న, రామచంద్ర, రమణయ్య తెలిపారు. వారి కథనం మేరకు.. మండల పరిధిలోని నాగూరువాండ్లపల్లె సబ్ స్టేషన్ పక్కన గల మామిడితోట వద్ద గల కంచెకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మామిడి తోట దగ్ధం కావడంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు చేరుకొని మంటలను అదు చేశారు. అప్పటికే 40 చెట్లు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.